# నాన్నుండాలి...!

-దుర్గాప్రసాద్ సర్కార్

"ఊ... ఊ... నేను స్కూలు కెళ్ళనూ..." ఏడేళ్ళ రవి తల్లి తన భుజానికి తగిలించిన పుస్తకాల్ని నేలకేసి కొట్టి ఏడుస్తూ అన్నాడు.

పావుగంట నుంచీ అలాగే మారాం చేస్తూ తన మాట వినకపోవటంతో భర్తకేసి నిస్సహాయగా చూసిందామె.

"ఏరా ఎందుకెళ్ళవూ? అక్కడ నీతో రాళ్ళు మోయిస్తున్నారా? బండలు కొట్టిస్తున్నారా?" వీపు మీద ఒక్కటి చరిచి పుస్తకాలు వాడి భుజానికి తగిలించాడు రవి తండ్రి.

"తప్పుబాబూ! బడికెళ్ళనని పేచీ పెట్టకూడదు రా!" రవిని ఎత్తుకుని రిక్షాలో కూర్చోబెట్టుకుని తొక్కుతూ రిక్షాని పోనివ్వసాగాడు రిక్షాతాత.

"నాకు స్కూలుకెళ్ళాలని లేదు రిక్షాతాతా! ఇంటిదగ్గరే ఉంటా... హాయిగా ఆడుకుంటా... పదకొండింటికి గాల్లోంచి వెళ్ళే విమానాన్ని చూస్తా... అసలు ఆ నానిగాడి వాళ్ళ నాన్నలా మానాన్న కూడా చచ్చిపోతే..."

"బాబూ...!" రవి మాటలకి ఒక్కసారిగా అరిచాడు రిక్షాతాత.

ఎప్పుడూ మంచి మాటలతో, మురిపించే కబుర్లతో తీసుకెళ్ళే రిక్షాతాత అలా గట్టిగా అరిచేసరికి బిత్తరపోయి చూశాడు రవి.

"మరెప్పుడూ అలా అనకు రవిబాబూ!" అన్నాడు మెల్లగా - పసివాడి మీద కేకలు వేసినందుకు నొచ్చుకున్నట్లు.

"ఏం ఎందుకనకూడదు?"

"నాన్నలేకపోతే మనకి బువ్వెట్లా వత్తాది? మంచి మంచి చొక్కాలూ, చాక్లెట్లూ ఎట్లా వత్తాయి?"

"ఎందుకు రావు?"

"రావు బాబూ! నాన్నుంటే... తను ఆఫీసుకి పోయి పనిచేసి జీతం తెస్తాడు. ఆ డబ్బులతో మనకేమేం కావాలో అవి తెచ్చుకుంటాం. మరి నాన్నే లేకపోతే ఎలా?"

రవి బదులేమీ ఇవ్వలేదు. అతనిలో ఇంకా కోపం ఛాయలు పోయినట్లు లేవు.

"అసలు నీలాగే ఉండకూడదూ! నాన్న చచ్చిపోతే నాకిక తిరుగులేదు నాన్న. అనుకున్న ఓ వెర్రిబాగులోడి కథ బెబుతే... నాన్న గొప్పదనం నీకు తెలుత్తాది"

"కథా... భలే భలే... చెప్పుతాతా!" ఉత్సాహంగ అన్నాడు రవి.

"బడి వచ్చేసింది బాబూ! సాయంత్రం తప్పః చెబుతాగా! జాగ్రత్తగా బడిలోకెళ్ళి చక్కగా సదువుకుని రా..." పస్తకాల సంచీ, కారియర్ ఉంచిన బ్యాగూ రవికిచ్చి వెనుదిరిగాడు రిక్షాతాత.

★ ★ ★

"గణ... గణ... గణ..." మంటూ లాంగ్‌బెల్ అవటంతో అడ్డు తొలగిన తూనీగల్లా ఒక్కసారిగా బయటపడ్డారు స్కూలు పిల్లలంతా.

రిక్షాల్లో కొందరూ, తమతమ తలిదండ్రుల వాహనాల మీద కొందరూ, కాలినడకన కొందరూ ముందుకు సాగిపోయారు.

"ఇదేమిటి? ఎప్పుడూ నాకంటే ముందు తనే వచ్చి ఉండేవాడే. ఈ రోజేమిటి ఇంకా రాలేదు? పైగా కథొకటి చెబుతానన్నాడు కూడా. ప్చ్..." చికాగ్గా అనుకున్నాడు రవి.


ఇంతలో రిక్షాతాత వస్తూ కన్పడ్డాడు. అది చూడగానే రవి మొహం విప్పారింది. రిక్షా ఇంకా బాగా దగ్గరవకముందే ఎదురెళ్ళి...

"ఏమిటి తాతా? ఇవాళ ఆలశ్యంగా వచ్చావేం?" అనడిగాడు.

"కాలికి దెబ్బ తగలింది బాబూ. దవఖానాకు పోయిన. సెధవది అక్కడ మందులిస్తారని కాళ్ళు గుంజేదాకా నిల్చున్నా... మందులైపోయినై అన్నారు. నేనే కట్టు కట్టుకున్నా..." గాయమైన కాలిని చూపించి చెప్పాడు.

"తాతా చూడూ! నీ కాలినుంచి ఇంకా రక్తమొస్తోంది..." రిక్షాలో ఎక్కి కూర్చొని అన్నాడు రవి.

"ఫర్వాలేదు లే! నువ్వు కథ చెప్పమని అడిగావుగా! చెబుతా వినుమరీ..." అక్కడ రోడ్డు 'అప్' అవ్వడంతో దిగి



లాగసాగాడు రిక్షాతాత.

"తాతా కాలు నొప్పెడుతోందా? దిగి తోసేదా?" అడిగాడు రవి.

"ఒద్దు నాయనా! ఒద్దు..."

"మరి నువ్విలా కష్టపడుతుంటే నాకదోలా ఉంటుంది. నేను తొందరగా పెద్దయ్యి, మంచి ఆఫీసర్నయి నీకు బోలెడు డబ్బులిస్తా. అప్పుడు నువ్వు రిక్షా లాగనే వద్దు."

"అట్టాగే తండ్రీ..." అక్కడ్నుంచి రోడ్డు సమాంతరంగా ఉండటంతో సీటుమీద కూర్చొని తొక్కసాగాడు. అప్పుడు మళ్ళీ గుర్తొచ్చినట్లుంది.

"ఊ... ఇంక కథ చెప్పు తాతా..." అన్నాడు రవి.

"అట్టాగే బాబూ! వినుమరి..." అంటూ చెప్పసాగాడు రిక్షాతాత.

★ ★ ★

"ఏరా భడవా... బడికి పోయినవు కాదంట..."

"సీ...సీ... ఎవురు సెప్పినరు నాయనమ్మ నీకూ?"

"నువ్వు బడికెళ్ళకుండా పెదరెడ్డిగారి మామిడితోపులో పడి కాయలు కోస్తూ నేస్తగాళ్ళతో చెరువు కట్టకేసి పోయినవుట. అళ్ళ పాలేరు తవిటయ్య సెప్పినాడు."

"లేదే! బడికెళ్ళినా...!"

"ఏరా పుండాకోరు వెధవా? బడికెళ్ళకుండా చేలంట పడి తిరుగుతావా? నీకెన్ని మార్లు సెప్పారా? చదువుకోరా... చదువుకోరా... లేకపోతే నాలా గొడ్డుబతుకుబతకాల్సి వస్తుందిరా అంటే ఇనవేం" బెత్తంతో నాలుగు వడ్డించాడు రాందాసు కొడుకుని.

"పోన్లే ఇక మీదట బుద్ధి గెలతాడులే..." నాయనమ్మ అడ్డుకుని వాణ్ణి లోనికి తీసుకెళ్ళింది.

★ ★ ★

"ఓలమ్మో... ఆ నెత్తురేందిరా?"

"సైకిల్ మీంచి పడిన..."

"అందుకే నిన్ను అయ్య సైకిల్ తియ్యొద్దనేది నా మాట ఇనకపోతివి. ఒళ్ళంతా నెత్తురోడేట్టు గాయాలు చేస్కుంటివి. ఆడికి తెలిస్తే నీ చెమ్డాలు సీరేత్తాడు" మనవడి చేతిలోంచి సైకిల్ తీసుకుని గోడవారగా ఉంచి, పెరట్లోంచి ఏవో ఆకులు తెచ్చి నలిపి, వాడి కురుపులపై అద్దింది.

తండ్రి నుంచి ప్రతిసారీ తనని కాపాడే నాయనమ్మంటే అందుకే ఎంతో ఇష్టం రాముకి.

★ ★ ★

"అమ్మా! రాముగాడు నా సైకిల్ తీసినాడా?"

"ఏమోరా నాయనా! నే చూళ్ళేదు!"

అయ్య, నాయినమ్మల మాటలు లోపల అన్నం తింటోన్న రాముకీ, వాడి తల్లికీ వినిపించాయి.

"నువ్వు సైకిల్ తీసావా?" అన్నట్టు సైగలతో అడిగింది వాడిని తల్లి.

వాడు బెదురుగా తల్లి మొహంలోకి చూస్తూ 'లేదు' అన్నట్టు తలూపాడు.

"మరి సైకిల్ హాండిల్‌బార్ ఓ పక్కకి తిరిగిపోయి, బ్రేకులు ఊడిపోతున్నాయి. అనుమానం లేదు వాడే తీసుంటాడు. వాడిని నువ్వు వెనకేసుకు వస్తున్నావ్. అసలు నీ వల్లే వాడు చెడి పోతున్నాడు. నువ్వేం వాడి విషయంలో ఇక కల్పించు కోమాకు" కోపంగా తల్లిని గదమాయించి లోపలికొచ్చి-

"ఏరా రామూ? సైకిల్ తీసి తొక్కినావా?" కోపంగా అడిగాడు.

"లేదు నాన్నా!"

"మరి సైకి పాడయి ఉంది."

"ఏమో మరి..."

"ఆ దెబ్బలేంటి? పడినావా?" రాము కొట్టుకుపోయిన మోకాలుని చూసి అడిగాడు.

వాడు మౌనం వహించాడు.

"ఛీ...ఛీ... పిల్లాడు చెడిపోతున్నా ఎవరికీ బాధ్యతలేదు. వాడు చేస్తున్న వెధవపనులు తెల్సీ వెనకేసుకొస్తున్నారు. ఇలాగైతే వాడు బాగుపడ్డట్లే..." చిరాగ్గా అని బయట పడ్డాడు.

రాము మెల్లగా నాయనమ్మ దగ్గర చేరాడు.

"సీ వెధవా! నా దగ్గరకు రామాకు! నీవల్ల నేను తిట్లు కాస్తున్న. ఫో అవతలికి! బుద్ధిగా చదువుకోరా అంటే ఇనవు. సైకిల్ తియ్యకురా అంటే ఇనవూ..." వాడిని దూరంగా నెట్టేసింది వాడి నాయనమ్మ.

తండ్రి కసిరినా, తల్లి కోప్పడినా అంత బాధుండదు కానీ, నాయినమ్మ కళ్ళెర్ర చేసినా తట్టుకోలేని రాముకి, ఏకంగా ఆమె తిట్టేసరికి దు:ఖం ఆగలేదు.

'తన తండ్రివల్లనే కదా! తనకిష్టమైన తననెంతో ముద్దుచేసే నాయనమ్మతో కూడా తాను తిట్లు తింది' అన్పించి-

"సీ...సీ... నాకు నాన్నొద్దు... నాన్న చావాలి..." అన్నాడు కోపంగా.

"ఓరి భడవా... అయేం మాటలు? తప్పురా" అంది నాయనమ్మ.

"అవును రోజూ నన్ను కొట్టి, తిట్టే నాన్న ఒద్దు చచ్చిపోవాలి. అప్పుడు నేను హాయిగా బడికెళ్ళక్కర్లేదు. నాన్నలేకపోతే ఇంక ఆ సైకిల్ నాదే కదా! అప్పుడెంచక్కా ఆ సైకిల్ మీద ఊరంతా తిరగొచ్చు" వాడి మాటలకి నాయనమ్మ ఆశ్చర్యంతో బుగ్గలు నొక్కుకుంటూంటే ఆటకి బయటకి పోయాడు రాము.

★ ★ ★

"ఒరే రామూ మీ ఇంటి ముందు ఆ జన మేమిట్రా?" ఆటనుంచి వస్తూ రాము ఇంటి ముందు జనాన్ని చూసి అడిగాడు వాడి స్నేహితుడు శీనూ.

"ఏమోరా తెల్దు!" సమాధానం చెప్పి రివ్వున పరిగెత్తాడు రాము. వాడినెంబడించాడు శీనూ.

"పాపం సైకిల్ బ్రేకులు పోయినా టైం దాటిపోతుందని బాగు చేయించుకోకుండానే ఫ్యాక్టరీకి వెళ్తుంటే ఇసుకలారీ గుద్దేసిందట. అక్కడిక్కడే సచ్చిపోయిండట రాందాసు."

జనాలు అడ్డుగా ఉండటంతో లోపలికెళ్ళలేక, ఎదరేముందో తెలీక అయోమయంతో పడిపోయిన రాముకి విన్పించాయా మాటలు.




ప్రతిభా భాస్కర్ భీమా, ఉమాభాస్కర్ భీమా, డి.ఎన్.ఎస్.ఎఫ్.సి స్టోర్స్, ఎల్.పి.జి.వింగ్, శక్కర్‌నగర్, బోధన్ , నిజామాబాద్ జిల్లా

ఒక్కక్షణం వాడికే భావమూ కలుగలేదు. తరువాత ఏదో తెలీని ఆనందం వాడినావరించింది.

ప్రయత్న మ్మీద జనాలమధ్య సందు చేసుకుని చూశాడు. అక్కడ వాడికి మరింత ఆనందం కలిగిస్తూ కన్పించిందా దృశ్యం.

చెక్కుచెదరని సైకిల్. తెల్లటి గుడ్డలో చుట్టబడిన తండ్రి శవం.

'హమ్మయ్య! సైకిల్‌కి పెద్దగా ఏమీ అవలేదు. నాన్నలేడు కాబట్టి ఇక ఇది నాదే' తృప్తిగా అనుకున్నాడు.

బంధువులెవరూ లేకపోవటంతో ఇరుగుపొరుగు వాళ్ళే జరగవలసినది జరిపించేశారు.

రామూ తన తల్లిని వీడి వెళ్ళిపోయిన లక్ష్మీ కళనీ, నాయినమ్మ మొహంలో చోటు సంపాదించిన దైన్యాన్నీ గమనించలేదు.

నేస్తాలతో ఆడటం, సైకిల్ తొక్కటం, చేస్తూ బడిని పూర్తిగా మర్చిపోయి, అదుపు తప్పిపోసాగాడు.

నాలుగయిదు నెలలు తర్వాత నాయినమ్మ కొడుకు మీద బెంగతో పరలోక పయనం కట్టింది.

కొత్త అలవాటులూ, సరదాలూ నాయనమ్మ మీది ప్రేమని కరిగించేశామో ఏమో, రామూకి నాయినమ్మ చావు పెద్దగా బాధించలేదు.

ఇల్లు గడవడానికి... తప్పనిసరయి రామూ తల్లి పాచిపనికి వెళ్ళసాగింది. దాంతో ఎవరి అదుపూ, ఆజ్ఞా లేక పూర్తిగా చెడిపోయినాడు రామూ."

రిక్షాతాత కథ చెప్పటం ఆపి, జారిపోయిన చైన్‌ని ఎక్కించి, ఒక్కక్షణం తుండు గుడ్డతో తన మొహానికి పట్టిన చెమటని తుడుచుకున్నాడు.

"ఊ... తర్వాతేమయింది తాతా?"

"ఏమవుతుంది? రామూ తల్లి కూడా కొన్నాళ్ళకి చచ్చిపోయింది. రామూ ఒంటరివాడయిపోయాడు. బడికెళ్ళకుండా ఉండటానికీ, సైకిల్ తొక్కడానికీ తండ్రి చచ్చిపోవాలని కోరిన రామూ... ఆ తండ్రి చచ్చిపోవటంతో తన వాళ్ళనీ, తన బంగారు భవిష్యత్తునీ పోగొట్టుకున్నాడు."

"తాతా! ఇది నిజంగా జరిగిందా?"

"అవును బాబూ!"

"అయితే ఇప్పుడా రామూ ఏం చేస్తున్నాడు?"

"సైకిల్ తొక్కాలని వెర్రిగా భ్రమపడిన ఆ రామూకి ఇప్పుడు ఆ సైకిల్... అదే... సైకిల్ రిక్షానే గతయ్యింది బాబూ. అదే ఇప్పుడా దౌర్భాగ్యుడి బతుకుదెరువు చదువుకోకపోవటం వల్లనూ, భవిష్యత్తుని తీర్చిదిద్దే నాన్న చచ్చిపోవాలని కోరుకోవటం వల్లనూ ఆడికా శిక్ష పడింది."

"తాతా! ఇప్పుడా రామూ ఎక్కడున్నాడు?"

"ఇదిగో... ఇక్కడే బాబూ."

"అంటే...?"


"అంటే అర్థమవలేదా బాబూ? నేనే ఆ రామూని... నీ రిక్షాతాతని" కళ్ళ నీళ్ళు తుడుచుకుని...

"దిగు! ఇల్లొచ్చేసింది..." అంటూ రవిని కిందికి దించాడు.

"తాతా! నేనెప్పుడూ బడికెళ్ళననీ... నాన్న చచ్చిపోవాలని అనను... నాన్నుండాలి..." అంటూ ఇంట్లోకి నడిచాడు రవి.

తృప్తిగా గాలిపీల్చి బెల్ మోగించుకుంటూ సాగిపోయాడు రిక్షాతాత.


దుర్గాప్రసాద్ సర్కార్
ఇ.నెం. 46-9-64. దొండపర్తికల.
విశాఖపట్నం - 530 016.


కె. చిన్నన్న, చిన్నమెట్‌పల్లి (పోస్ట్) - 505 453, కోరుట్ల (మం), కరీంనగర్ జిల్లా

కథ

# పుస్తకం

-ఎ.ఆర్. రావ్

హరిహర్రావూ, గిరిధర్‌రావూ ఫ్రెండ్స్. చిన్ననాటి స్నేహితులు.

ఒకే ఊళ్ళో, ఒకే బళ్ళో చదువుకుని, చెట్టాపట్టాలేసుకు తిరిగిన వాళ్ళు.

ఇద్దరూ పెద్దవాళ్ళయి వేర్వేరు రంగాల్లో స్థిరపడిపోయారు.

అయినా వాళ్ళ స్నేహాన్ని వాళ్ళు మర్చిపోలేదు.

హరిహర్రావు కవి, రచయితగా తయారయ్యాడు. గిరిధర్‌రావు రాజకీయాల్లో ప్రవేశించి, ఛోటా నాయకుడి స్థాయినుంచి ఎదిగి మంత్రి అయ్యాడు. వాళ్ళు స్నేహితుల్లాగా అప్పుడప్పుడూ కలుస్తూ, పలకరించుకుంటూనే ఉన్నారు.

హరిహర్రావు ఓ మంచి పుస్తకం రాశాడు. ఆ పుస్తకం విడుదల ఫంక్షన్‌కు గిరధర్‌రావు వచ్చాడు. పుస్తకం రిలీజ్ చేశాడు.

వేదిక మీదఉన్న వాళ్ళంతా "ఆహా ఓహో" అని రచయితనీ, మంత్రినీ పొగిడారు. ఆ పుస్తకాన్ని హరిహర్రావు ప్రేమతో, స్నేహవాత్సల్యంతో గిరిధర్ రావుకే అంకితం కూడా చేశాడు.

సభ ముగిసింది. స్నేహితుడైన మంత్రి గిరిధర్‌రావుకి సంతకం చేసి - ఆ పుస్తకం ఆయన చేతిలో పెట్టాడు హరిహర్రావు.

థాంక్స్‌చెప్పి వస్తానని కరచాలం చేసి పుస్తకం తీసుకుని మందీమార్బలంతో వెళ్ళిపోయాడు మంత్రి గిరిధర్‌రావు.

కాలచక్రంలో ఓ ఏడాది తిరిగిపోయింది.

ఓ రోజు ఏమీ తోచక బజార్లోవెళుతూ ఫుట్‌పాత్ మీద పెట్టిన పుస్తకాల దుకాణాల్లో చూస్తున్నాడు హరిహర్రావు తనకి కావాల్సిన పుస్తకం కోసం.

అలా రెండు షాపులు చూశాడు. మూడో షాపులో తనకి కావాల్సిన పుస్తకం దొరక్కపోయినా తను రాసిన పుస్తకం కంటబడింది.

'తన పుస్తకం అప్పుడే పేవ్‌మెంట్స్ మీదకి కూడా వచ్చేసిందా!" అనే ఆశ్చర్యంతో పుస్తకం తెరచిన హరిహర్రావు అశ్చర్యపోయాడు.

అది తను మంత్రి గిరిధర్‌రావుకి సభలో సంతకం చేసి ఇచ్చిన కాపీ! ఆ కాపీని అక్కడ చూడగానే ఒళ్ళు మండిపోయింది హరిహర్రావుకి.

షాపువాడితో బేరంచేసి, దానిమీద మళ్ళీ సంతకం చేసి, తేదీవేసి మంత్రి గిరిధర్‌రావు అడ్రసుకి పోస్టుచేస్తే గానీ నిద్రపట్టలేదు రచయిత హరిహర్రావుకి.


ఆకెళ్ళ గిరిజ
ఉత్తమ్‌నగర్, I క్రాస్.
21-138-2, ఫ్లాట్ నం.41
హైదరాబాద్-47.